క్లుప్తంగా

చిరస్మరణీయురాలు వెలగపూడి సరస్వతమ్మ



బాపట్ల: బాపట్ల ప్రాంతంలో స్త్రీ విద్యా వ్యాప్తికి విశేషంగా కృషి చేసిన వారిలో అగ్రగణ్యులు వెలగపూడి సరస్వతమ్మ అని ఫోరం ఫర్ బెటర్ బాపట్ల కార్యదర్శి డాక్టరు పి.సి.సాయిబాబు పేర్కొన్నారు. సరస్వతమ్మ జయంతి సందర్భంగా ఆమె విగ్రహం వద్ద ఆదివారం నివాళి అర్పించారు. ఈ సందర్భంగా సాయిబాబు మాట్లాడుతూ 1915లో సరస్వతమ్మ ప్రారంభించిన యువతి విద్యా నిలయం నేడు ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలగ అభివృద్ధి చెందిందని గుర్తు చేశారు. కళాశాల అభివృద్ధికి సరస్వతమ్మ తన జీవిత సర్వస్వాన్ని అర్పించారని తెలిపారు. పట్టణం నడిబొడ్డున అర ఎకరం స్థలాన్ని విద్యా సంస్థకు విరాళంగా ఇచ్చారని చెప్పారు. ఎస్ఎంజీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు కె.శివ పార్వతి, జి.గాయత్రి, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యాలయాలు ప్రజల ఆస్తి

పట్టణ సీఐ మల్లికార్జునరావు



రేపల్లె రూరల్: ప్రభుత్వ కార్యాలయాలను పరిశుభ్రంగా ఉంచాలని పట్టణ సీఐ మల్లికార్జునరావు సూచించారు. పట్టణంలోని సర్కిల్ కార్యాలయ ఆవరణంలో పోలీసు సిబ్బందితో ఆదివారం పారిశుద్ధ్యంపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే ప్రజలు వ్యర్థ పదార్థాలను చెత్త కుండీలలో మాత్రమే వేయాలన్నారు. ప్రభుత్వ కార్యాలయాలంటే ప్రజల ఆస్తి అని స్పష్టం చేశారు. కార్యాలయ ఆవరణంలో చెత్త, నిరుపయోగంగా ఉన్న బోర్డులు, పిచ్చి మొక్కలను తొలగించారు. ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

కమ్మేసిన పొగ మంచు



భట్టిప్రోలు: పొగ మంచు దట్టంగా కమ్ముకుంటోంది. భట్టిప్రోలు–బాపట్ల–వెల్లటూరు రహదారిలో బుధవారం ఉదయం 8 గంటలు దాటినా పొగ మంచు వీడ లేదు. వాహన చోదకులు ఇక్కట్లకు గురవుతున్నారు. వాహనా లైట్ల వెలుగుల్లోనే నెమ్మదిగా వెళ్తున్నారు.

రీ సర్వేకు గ్రామాల ఎంపిక

రేపల్లె రూరల్: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన రీసర్వే కార్యక్రమానికి డివిజన్ పరిధిలోని తొమ్మిది మండలాల్లోని 9 గ్రామాలను ఎంపిక చేసినట్లు ఆర్డీవో నేలపు రామలక్ష్మి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపిక చేసిన గ్రామాల్లో జనవరి 6 నుంచి సర్వే ప్రక్రియ ప్రారంభమవుతుందన్నారు. ఆయా గ్రామాల్లోని ప్రభుత్వ, అసైన్డ్, ప్రైవేటు భూములను పూర్తిగా సర్వే నిర్వహించి హద్దులు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అమర్తలూరు మండలంలోని కోడితాడిపర్రు, భట్టిప్రోలు మండలంలోని సూరేపల్లి, చెరుకుపల్లి మండలంలోని నడింపల్లి, కొల్లూరు మండలంలోని గురివిందపల్లి, నగరం మండలంలోని సిరిపూడి, నిజాంపట్నం మండలంలోని ముత్తుపల్లి, రేపల్లె మండలంలోని ఉప్పూడి, చుండూరు మండలంలోని మండూరు, వేమూరు మండలంలోని వరహాపురం గ్రామాల్లో తొలివిడతగా సర్వే చేయనున్నట్లు తెలిపారు.

ఉచిత కంటి వైద్య శిబిరం



పెరవలి(వేమూరు): పేదలకు ఉచితంగా కంటి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు చదలవాడ స్కిన్ అండ్ ఐ కేర్ సెంటరు వైద్యురాలు చదలవాడ ఉమాదేవి తెలిపారు. మండలంలో పెరవలి గ్రామంలో సాయిబాబా గుడి వద్ద ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. పెరవలి, పెరవలిపాలెం, చావలి, కోడిపర్రు గ్రామాలకు చెందిన 60 మందికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. 15 మందికి తెనాలి చదలవాడ సెంటరులో ఉచితంగా కంటి అపరేషన్లు చేయడం జరుగుతుందని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉక్కుర్తి నాగేశ్వరరావు, బండారు సూరిబాబు పాల్గొన్నారు.

నాడు వెలుగులు.. నేడు చీకట్లు

- రేపల్లె ఓల్డ్‌టౌన్‌లో వెలగని సెంట్రల్ లైటింగ్
- వాహన చోదకులకు తప్పని తిప్పలు



వైఎస్సార్ సీపీ హయాంలో సెంట్రల్ లైటింగ్ వెలుగులు (ఫైల్)

రేపల్లె రూరల్: ఓల్డ్ టౌన్ ప్రధాన రహదారిలో చిమ్మచీకట్లు అలముకుంటున్నాయి. అధికారుల నిర్లక్ష్యంతో వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సెంట్రల్ లైటింగ్ తరచూ ఆరిపోతోంది. దారి కనిపించక వాహన చోదకులు తరచూ అదుపు తప్పి గాయాలపాలవుతున్నారు. రేపల్లె రెవెన్యూ డివిజన్ కేంద్రంగా ఏర్పడటంతో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పట్టణాభివృద్ధికి శ్రీకారం చుట్టింది. దీనిలో భాగంగా కుచించుకుపోయిన ఓల్డ్ టౌన్ రహదారుల విస్తరణకు రూ.2.25 కోట్లు కేటాయించింది. వీటిలో అంకమ్మ చెట్టు నుంచి పెద మసీదు వరకు 60 అడుగుల రహదారి నిర్మాణం, సైడ్ కాల్వల ఏర్పాటుతో పాటు సుందరంగా సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేశారు. దీంతో ఓల్డ్ టౌన్ గోల్డ్ టౌన్‌గా రూపాంతరం చెందుతోంది.

కూటమిలో అంధకారం

కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటి నుంచి పట్టణాభివృద్ధి కుంటుపడింది. గతంలో వెలుగులు విరజిమ్మిన సెంట్రల్ లైటింగ్ మరమ్మతులకు గురైనా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. రేపల్లె పట్టణానికి వచ్చేందుకు ఇదే ప్రధాన రహదారి కావడంతో.. నిత్యం వందల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. రాత్రిళ్లు రహదారిలో లైటింగ్ లేకపోవడంతో వాహన చోదకులు తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారు. తరచూ ప్రమాదాలకు గురై గాయాలపాలవుతున్న ఘటనలు ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి సెంట్రల్ లైటింగ్ సక్రమంగా పనిచేసేలా చూడాలని వాహన చోదకులు కోరుతున్నారు.



కూటమి ప్రభుత్వంలో సెంట్రల్ లైటింగ్ వెలగక గాఢాంధకారం

ఫ్లెక్సీల కారణంగా మరమ్మతులు



గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఓల్డ్ టౌన్ ఎంతో అభివృద్ధి చెందింది. ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతూ రహదారులను విశాలంగా విస్తరించారు. సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక సెంట్రల్ లైటింగ్ పోల్స్‌కు తరచూ ఫ్లెక్సీ బ్యానర్‌లు ఏర్పాటు చేస్తున్నారు. దీంతో మరమ్మతులకు గురవుతున్నాయి. ప్రభుత్వ ఆస్తులను విచ్చలవిడిగా ధ్వంసం చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు.

– చదలవాడ శ్రీనివాసరావు, కౌన్సిలర్, 3వ వార్డు

మా దృష్టికి రాలేదు



ఓల్డ్ టౌన్ సెంట్రల్ లైటింగ్‌ను నిత్యం పర్యవేక్షిస్తున్నాం. గతంలో మరమ్మతులు చేయించాం. ప్రస్తుతం మరమ్మతులకు గురైనట్లు మా దృష్టికి రాలేదు. వెంటనే పరిశీలించి, సమస్యను పరిష్కరిస్తాం.

– కాకర్ల సాంబశివరావు, మున్సిపల్ కమిషనర్, రేపల్లె

బాధిత కుటుంబాలకు అశోక్‌బాబు పరామర్శ

భట్టిప్రోలులో గుడ్ మార్నింగ్ కార్యక్రమం



భట్టిప్రోలులోని ఓ హోటల్‌లో అల్పాహారం తీసుకుంటున్న సమన్వయకర్త అశోక్‌బాబు

భట్టిప్రోలు: మండల కేంద్రమైన భట్టిప్రోలులో ఆదివారం వైఎస్సార్ సీపీ వేమూరు నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు పర్యటించారు. ఉదయమే గ్రామానికి చేరుకుని ప్రతి ఒక్కరిని పేరు పేరున పలకరించారు. వారి బాగోగులను అడిగి తెలుసుకున్నారు. అలాగే అనారోగ్యంతో బాధ పడుతున్న పప్పుల విజయరాజు భార్య మేరీనా, కంచర్ల జక్రయ్య, మద్దుల రాముడు, కొతరపు నాగేంద్రం (జిన్నా), ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన అబ్దుల్లా బేగ్ కుమారుడు అస్మత్ బేగ్‌ను ఆయన పరామర్శించారు. స్థానిక బస్టాండ్ సెంటర్‌లో పార్టీ శ్రేణులతో కలసి అల్పాహారం తీసుకుని, సరదాగా వారితో ముచ్చటించారు. ఈ సందర్భంగా అశోక్‌బాబు మాట్లాడుతూ ఇకపై నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో గుడ్ మార్నింగ్ కార్యక్రమం నిర్వహిస్తూ ప్రజలు, పార్టీ కార్యకర్తలు, నాయకులతో మమేకమై ముందుకు వెళ్లనున్నట్లు చెప్పారు. జనవరి 3న జరగాల్సిన వైఎస్సార్ సీపీ ధర్నా 29న నిర్వహించాలని పార్టీ అధిష్టానం నిర్ణయించినట్లు తెలిపారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయాలని చేయాలనే డిమాండ్‌తో ధర్నాకు పిలుపునిచ్చిన వైఎస్సార్ సీపీ జనవరి 3న ఇంజనీరింగ్, డిగ్రీ విద్యార్థులకు పరీక్షలు ఉండటంతో వాయిదా వేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు కుందేటి రమేష్, వార్డు సభ్యులు పెరికల శ్యామ్, అబ్దుల్ కరీమ్, కుక్కల భూషణరావు, వైఎస్సార్ సీపీ వివిధ విభాగాల నాయకులు పాల్గొన్నారు.

పార్టీ కార్యకర్తలకు పరామర్శ

వేమూరు: మండల కేంద్రంలోని వైఎస్సార్ సీపీ కార్యకర్తల కుటుంబాలను ఆ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు ఆదివారం పరామర్శించారు. అనారోగ్యంతో బాధపడుతున్న గొడుగు ప్రకాశ్, మండల పరిషత్ కో–ఆప్షన్ మెంబరు సతీమణి మేరీ కమలతో మాట్లాడారు. వారి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. పార్టీ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. కోగంటి లవకుమార్, తలతోటి సువర్ణరాజు, దున్నా మేరీసుబాబు, తలతోటి జిగస్‌బాబు, దొప్పలపూడి జ్యోతిబాబు, గుమ్మడి దానియేలు పాల్గొన్నారు.

గౌతు లచ్చన్న విగ్రహానికి క్షీరాభిషేకం



గౌతు లచ్చన్న విగ్రహానికి నివాళులర్పిస్తున్న కేసన పమిడయ్య, నాయకులు

నిజాంపట్నం: బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి సర్దార్ గౌతు లచ్చన్న విగ్రహావిష్కరణ సందర్భంగా నూజివీడులో చోటు చేసుకున్న ఘటన దురదృష్టకరమని బీసీ సంఘ నాయకుడు కేసన పమిడయ్య విచారం వ్యక్తం చేశారు. కూచినపూడి మెయిన్ సెంటరులో ఆదివారం సర్దార్ గౌతు లచ్చన్న విగ్రహానికి క్షీరాభిషేకం నిర్వహించారు. పమిడయ్య మాట్లాడుతూ కుల మత ప్రాంత రాజకీయాలకు అతీతంగా అన్ని వర్గాల సంక్షేమం, సమాజ సాధికారితకు కృషి చేసిన వ్యక్తి సర్దార్ గౌతు లచ్చన్న అని కొనియాడారు. అటువంటి గొప్ప వ్యక్తి విగ్రహాన్ని నూజివీడులో గౌడ సంఘీయులు ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తే.. రాజకీయాలకతీతంగా అన్నివర్గాల వారు హాజరయ్యారని చెప్పారు. కానీ, ప్రజాప్రతినిధులు సంకుచిత ధోరణితో స్పందించడం అనైతికమన్నారు. రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘ నాయకుడు కేసన శంకరరావు పిలుపు మేరకు రాష్ట్ర వ్యాప్తంగా గౌతు లచ్చన్న విగ్రహాలకు నదీ జలాలు, పాలతో అభిషేకాలు నిర్వహించారు. బీసీ సంఘ నాయకులు కేసన సోమయ్య, బొర్రా సాంబశివరావు, బొర్రా రాఘవులు, కాంతారావు, గోపీ, లుక్కా సోమేష్, కే.హరిబాబు, యేమినేని వెంకటేశ్వరరావు, ఉప్పాల రమేష్‌బాబు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఐకమత్యమే మహా బలం

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎ.శ్యామలారెడ్డి



సభలో మాట్లాడుతున్న శ్యామలారెడ్డి

బాపట్ల: వివిధ రంగాల్లో స్థిరపడిన రెడ్డి ఆత్మీయ సోదరులు ఒకరికొకరు సహకరించుకోవడం ద్వారా సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా బలపడతారని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆరే శ్యామలారెడ్డి పేర్కొన్నారు. శ్యామల కోటిరెడ్డి అధ్యక్షతన రెడ్డి బిజినెస్ గ్రూపు నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని, మాట్లాడారు. పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం రెడ్డి బిజినెస్ గ్రూపు వ్యవస్థాపకుడు శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో ఆత్మీయ సమావేశం జరిగింది. వివిధ రంగాల్లో స్వయం కృషితో ఎదిగి స్థిరపడిన రెడ్డి సామాజిక వర్గానికి చెందిన పలువురిని ఒకే వేదిక మీదకు తీసుకొచ్చారు. ఈ సమావేశంలో శ్యామలారెడ్డి మాట్లాడుతూ రెడ్డి సామాజికవర్గం తాము ఎదుగుతూ...ఎదుటివారి ఎదుగుదలను కోరుకుంటుందని చెప్పారు. సామాజిక అభివృద్ధికి అందరం కలిసి కృషి చేయాలని ఆమె సూచించారు. వరల్డ్ వైడ్ ఎడ్యుకేషన్ కన్సల్టెన్సీ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ఉడుముల వెంకటేశ్వర రెడ్డి మాట్లాడుతూ దేశ విదేశాలలో విద్య అవకాశాల కోసం తన వంతు సహకారాన్ని అందిస్తానన్నారు. విజయవాడ పట్టణానికి చెందిన ప్రసిద్ధ బీఎస్ఆర్ జువెలర్స్ డైరెక్టర్ వింతా శ్రీనివాసరెడ్డి, మల్లారెడ్డి గ్రూప్ ఆఫ్ ఎడ్యుకేషన్ సంస్థల డైరెక్టర్ అన్నపురెడ్డి రామస్వామి రెడ్డి, రెడ్డి బిజినెస్ ఏనుగు శ్రీనివాసరెడ్డి తమ సేవలందిస్తామని తెలిపారు. సినీ నటుడు శ్రీ హర్షరెడ్డి ఈ కార్యక్రమంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఆయన నటించిన లవ్ యు ఫాదర్ సినిమా సాంగ్ లాంచ్ చేశారు. రెడ్డి బిజినెస్ గ్రూపు సంస్థ నూతన సంవత్సర క్యాలెండర్‌ను శ్యామలారెడ్డి, శ్రీహర్షారెడ్డి ఆవిష్కరించారు. కుంచాల భూపతి రెడ్డి, మోదుగుల బసవపున్నారెడ్డి, సంగు గోవర్ధన్ రెడ్డి, మున్నం భోగేశ్వర రెడ్డి, కంటి వైద్యులు కొల్లి శివరామిరెడ్డి, గుంటూరు రెడ్డి హాస్టల్ సంజీవరెడ్డి, ఐ కోటా రహీం రెడ్డి, అడ్వకేట్స్ పిట్ల శ్రీనివాస్ రెడ్డి, భోగి రెడ్డి రమేష్ రెడ్డి, ఈశ్వర్ రెడ్డి, శ్రీనివాసరెడ్డి, సమ్మెట శ్రీనివాస్ రెడ్డి, దొంతిరెడ్డి ఏడుకొండలు, ఆక్వా వ్యాపారవేత్త అక్కల రమణారెడ్డి, గ్రామీణ వైద్యులు దుండి మస్తాన్ రెడ్డి, దిండు విష్ణువర్ధన్ రెడ్డి, సర్పంచి పిట్టు ఏడుకొండలు రెడ్డి పాల్గొన్నారు.

శ్రమైక జీవన్



కొల్లూరు: చిన్నపాటి ఆలోచన ఇద్దరి శ్రమను ఒకరికే పరిమితం చేసింది. నిర్మాణ రంగంలో కూలీల పాత్ర కీలకం. లక్షలాది మంది ఉపాధి పొందుతున్న ఈ రంగంలో ప్లాస్టరింగ్ పనులు చేపట్టాలంటే తప్పని సరిగా ఇసుక జల్లించి రాయి రప్పా తొలగించాలి. జల్లెడను ఇరువైపులా ఇద్దరు పట్టుకొని ఇసుకను జల్లించడం సర్వసాధారణం. చినపులివర్రులోని నిర్మాణంలో ఉన్న ఓ గోడౌన్ వద్ద ఛత్తీస్‌గఢ్ కూలీలు చిన్నపాటి ఉపాయంతో జల్లెడ శ్రమను ఒకరికి తగ్గించారు. బలమైన కర్రను భూమిలో పాతి, దానికి ఇసుక జల్లెడకు ఓ వైపు తాళ్లు కట్టి మరోవైపు ఒక మహిళా కూలీనే ఇసుక జల్లించడం ఇక్కడ కనిపిస్తోంది. దీంతో అదనంగా మరో కూలీ లేకుండానే పని సులువుగా అయిపోతోంది.

చీరలు, దుప్పట్లు పంపిణీ



కర్లపాలెం: పేదలకు చేయూతనందించటం వల్ల సంతృప్తి లభిస్తుందని కరుణా జీవన్ మినిస్ట్రీస్ అధ్యక్షుడు ఇనకొల్లు పోలీస్‌రావు తెలిపారు. కరుణా జీవన్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో కనపర్తి రాజారావు ఆర్థిక సహకారంతో కర్లపాలెం లంక కాలువ కట్టపై ఉంటున్న గిరిజనులకు ఆదివారం చీరలు, దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్‌రావు మాట్లాడుతూ అందరూ పిల్లలను చక్కగా చదివించాలన్నారు. ఈ కార్యక్రమంలో కనపర్తి రాజారావు, జీవన్‌సాగర్ పాల్గొన్నారు.

పారిశుద్ధ్యం పట్టదు..



జంపని గ్రామంలో పేరుకుపోయిన చెత్తకుప్ప

వేమూరు: గ్రామ పంచాయతీ కార్యదర్శులు పారిశుద్ధ్యాన్ని పట్టించుకోవడం లేదని పలు గ్రామాల ప్రజలు విమర్శిస్తున్నారు. మండలంలోని జంపని, వేమూరు, చావలి మేజరు గ్రామ పంచాయతీల్లో పారిశుద్ధ్య కార్మికులు సేకరించిన చెత్తను ఊరిని ఆనుకునే పడ వేస్తున్నారు. చెత్త నిల్వలు పెరిగిపోవడంతో వ్యాధుల బారిన పడుతున్నట్లు ప్రజలు చెబుతున్నారు. ఈ చెత్త కుప్పల్లో పందులు చేరి, మరింత అధ్వానంగా తయారు చేస్తున్నాయి. వేమూరులో పందుల బెడద విపరీతంగా ఉంది. పంచాయతీ అధికారులు వాటిని పట్టించుకోవడం లేదు. గతంలో వేమూరు గ్రామంలో పారిశుద్ధ్య లోపం కారణంగా అంటు వ్యాధులు ప్రబలి పలువురు మృతి చెందిన ఘటనలున్నాయి. గతేడాది జంపని గ్రామంలో జ్వరాలు వ్యాప్తి చెందాయి. చావలి గ్రామ పంచాయతీలోనూ మలేరియా, టైఫాయిడ్ జ్వరాలు బారిన పడ్డారు. గ్రామ పంచాయతీ అధికారులు పారిశుద్ధ్యంపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.



వేమూరులోని చెత్త కుప్పలో పందులు

అథ్లెటిక్స్‌లో సత్తా చాటిన ఐలవరం పీడీ



పోల్‌వాల్ట్‌లో ప్రతిభ చూపి గోల్డ్‌మెడల్ సాధించిన శ్రీనివాసరెడ్డి (మధ్యలో)

భట్టిప్రోలు: గుంటూరులోని ఎన్టీఆర్ స్టేడియంలో శని, ఆదివారాల్లో జరిగిన ఆరవ ఏపీ మాస్టర్స్ అథ్లెటిక్ చాంపియన్ షిప్–2024లో ఐలవరం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఫిజికల్ డైరెక్టర్‌గా పని చేస్తున్న తుమ్మా శ్రీనివాసరెడ్డి 60 ప్లస్ విభాగంలో పోల్ వాల్ట్, లాంగ్ జంప్‌లలో సత్తా చాటారు. ప్రథమ స్థానంలో నిలిచారు. ఫిబ్రవరి ఒకటి నుంచి 3వ తేదీ వరకు కేరళలో జరగనున్న జాతీయ స్థాయి పోటీలకు శ్రీనివాసరెడ్డి అర్హత సాధించారు. పోల్‌వాల్ట్‌లో 1.90 మీటర్లు, లాంగ్ జంప్‌లో 3.92 మీటర్లు దూకి గోల్డ్ మెడల్స్ సాధించారు. ఈ పోటీలలో 400 మంది రాష్ట్ర వ్యాప్తంగా స్త్రీ, పురుష, వెటరన్ అథ్లెటిక్స్ వివిధ విభాగాల్లో పాల్గొన్నారు. ఎంఈవోలు పులి లాజర్, నీలం దేవరాజు, ప్రధానోపాధ్యాయులు ఎం. మోహన్‌రావు, గ్రామ సర్పంచ్ మాచర్ల కోటేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యులు మురుగుడు శ్రీనివాసరావు అభినందించారు.

పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలి



కరపత్రాలు పంపిణీ చేస్తున్న సీపీఎం నాయకులు

రేపల్లె రూరల్: రాష్ట్ర ప్రభుత్వం పెంచిన విద్యుత్ భారాన్ని వెంటనే తగ్గించాలని సీపీఎం పట్టణ కార్యదర్శి మణిలాల్ డిమాండ్ చేశారు. పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించి స్మార్ట్ మీటర్ల విధానాన్ని రద్దుచేయాలని డిమాండ్ చేస్తూ పట్టణంలో సీపీఎం ఆధ్వర్యంలో ఆదివారం కర పత్రాలను పంపిణీ చేసి, మాట్లాడారు. ఎన్నికల సమయంలో స్మార్ట్ మీటర్లు ధ్వంసం చేయాలని ప్రజలకు చంద్రబాబు, లోకేషలు పిలుపునిచ్చి అధికారంలోకి వచ్చారని గుర్తుచేశారు. ఇప్పుడు స్మార్ట్ మీటర్లు ఏర్పాటుకు అంగీకారం చెప్పటమేమిటని ప్రశ్నించారు. స్మార్ట్ మీటర్లతో లాభాలకంటే నష్టాలు అధికంగా ఉన్నాయన్నారు. ప్రజలకు నష్టం చేకూర్చే స్మార్ట్ మీటర్లను వెంటనే రద్దుచేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల్లో హామీనిచ్చిన విధంగా విద్యుత్ ఛార్జీల పెంపు నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలన్నారు. పెంచిన విద్యుత్ ఛార్జీలను తగ్గించకుంటే ఉద్యమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. స్మార్ట్ మీటర్లతో కలిగే నష్టాలను పట్టణంలోని పలు దుకాణాల యజమానులకు వివరించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఆశీర్వాదం, కే.రమేష్, జే.ధర్మరాజు, దానియేలు, నవీన్, కృష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పట్టణాభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి



మాట్లాడుతున్న పట్టణ ఆదర్శ వేదిక కన్వీనర్ యడ్లపల్లి కిషోర్‌బాబు

రేపల్లెరూరల్: పట్టణాభివృద్ధిపై పాలకులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని పట్టణ ఆదర్శ వేదిక కన్వీనర్ యడ్లపల్లి కిషోర్‌బాబు అన్నారు. పట్టణంలోని 7వ వార్డులో ఉన్న ఆదర్శ వేదిక కార్యాలయంలో ఆదివారం ఆదర్శ వేదిక కమిటీ సమావేశం నిర్వహించారు. పాలకులు పట్టణాభివృద్ధిపై తీసుకోవాల్సిన పలు అంశాలను ప్రస్తావించారు. గతంలో రేపల్లె నియోజకవర్గంలో పనిచేసిన ప్రజాప్రతినిధులు అనేక విధాలుగా పట్టణాభివృద్ధి చేశారని గుర్తుచేశారు. పట్టణాభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించే విధంగా ప్రస్తుత పాలకులు కృషి చేయాలని కోరారు. నిధులతో డివిజన్ ప్రధాన కేంద్రమైన రేపల్లె రూపురేఖలు మార్చాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో సభ్యులు కె.సుబ్బారావు, మోహనరావు, గుంటి సాంబశివరావు, సాయికృష్ణమాచార్యులు పాల్గొన్నారు.

గ్రామాల్లో సంక్రాంతి శోభ

గ్రామాల్లో సంక్రాంతి సందడి మొదలైంది. ధనుర్మాసం ప్రారంభం నుంచి సంక్రాంతి శోభ సంతరించుకుంది. పెద్ద పండగ అనగానే మనకు గుర్తువచ్చేది ఇళ్ల ముందు రంగ వల్లులు, హరిదాసుల హరి నామ కీర్తనలు,గంగిరెద్దులాటలు. గ్రామీణ ప్రాంతాల్లో ఈ వాతావరణం కనిపిస్తోంది. – నగరం



హరిదాసుకు బియ్యం పోస్తున్నచిన్నారులు



గొబ్బెమ్మలతో అలంకరించిన రంగవల్లి



నగరంలో గంగిరెద్దు సందడి

పేదలకు సేవ చేయడం హర్షణీయం



ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న జయప్రకాష్ నారాయణ

బాపట్లటౌన్: పేదలకు వైద్య సేవలు అందించడం హర్షణీయమని రాష్ట్ర కల్లు గీత కార్పొరేషన్ మాజీ చైర్మన్ తాతా జయప్రకాష్ నారాయణ అన్నారు. పట్టణంలోని యజ్ఞ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఆదివారం మండలంలోని నందిరాజుతోట గ్రామంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వైద్య శిబిరాన్ని ప్రారంభించిన జేపీ మాట్లాడుతూ పేద ప్రజలకు అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహించి, తగిన మందులు ఉచితంగా ఇవ్వడం చాలా సంతోషదాయకమన్నారు. యజ్ఞ హాస్పిటల్ ప్రముఖ కార్డియాలజిస్ట్ యజ్ఞ శ్రీకాంత్ మాట్లాడుతూ నియోజకవర్గవ్యాప్తంగా ఇప్పటికే 10 ఉచిత మెగా క్యాంపులు నిర్వహించామన్నారు. ఈ వైద్య శిబిరంలో 200 మంది వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

అద్దేపల్లిలో వరికుప్ప దహనం



భట్టిప్రోలు: అద్దేపల్లికి చెందిన పీకే నారాయణ స్వామికి చెందిన ఎకరం వరికుప్పను గుర్తుతెలియని వ్యక్తులు ఆదివారం దహనం చేశారు. సుమారు రూ. 50 వేలు నష్టం వాటిల్లినట్లు బాధితుడు తెలిపారు. ఈ సందర్భంగా నారాయణ స్వామిని టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి కనపర్తి సుందరరావు, బీసీ సెల్ వేమూరు నియోజకవర్గ అధ్యక్షుడు బట్టు మల్లికార్జునరావు, వెల్లటూరు డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ యర్రంశెట్టి కరుణ శ్రీనివాసరావు, కార్యదర్శి పోకూరి సురేంద్ర, ఉపాధ్యక్షుడు జంగం శ్యాంసన్, తిరువీధుల బాలాజి పరామర్శించారు. వరికుప్పను పరిశీలించారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు దృష్టికి తీసుకువెళ్లనున్నట్లు వారు తెలిపారు.